# పాప ఫలం

"మీ యజమానురాలి కబుర్లు తప్ప ఇంకేమైనా చెబుదూ.." అన్నాడు జగ్గారావు గౌరితో రోడ్డు మీద నుండి దృష్టి మరల్చకుండానే.

అసలా ఆదివారం మాంచి రొమాంటిక్ సండేగా ప్లాను చేసాడతను. గౌరిని ఇంప్రెస్ చేయడానికి వెతికి, వెతికి ఓ పాత హిల్‌మన్ కారు సంపాదించాడు. పదివేలలో ఆ కారు కొనగలిగాడంటేనే కారు ఇక్ష్వాకుల కాలం నాటిదని, దాని కండిషను పరమ చెత్తగా ఉందనీ సులభంగా ఊహించవచ్చు. కానీ సున్నాలు కొట్టే పనిలో నెలకు రెండు వేలు కూడా గడించలేని జగ్గారావుకి పదివేలు సంపాదించడం కూడా చాలా కష్టమే. ఆర్నెల్లపాటు కూడబెట్టి అది కొన్నాడంటే దానికి కారణం అతనికి గౌరి మీద ఉండే ప్రేమే.

కారు కండిషను ఎలా ఉన్నా గౌరికి సంతృప్తిగానే ఉంది. జానకమ్మ గారికి కారు ఉంది. వాళ్లింట్లో పాచిపని చేసుకునే తనకూ కారుంది. వాళ్లది ఎస్టీమ్ కావచ్చు, తనది కాస్త పాతది కావచ్చు. పాతయితేనే, కొత్తయితేనే, కారంటే కారే! ఓ ఆదివారం నాడు పనికి నాగా పెట్టేసి ప్రియుడితో కార్లో గండిపేట వెళ్లాలని తమ చిరకాలంగా కంటున్న కల. అది ఇవాళ నెరవేరుతోంది. అదీ ఉత్సాహం. ఆ ఉత్సాహంతోనే తన యజమానురాలిని తిట్టిపోస్తోంది. దాని పొగరు ఎలా అణచాలో ప్లానులు వేసి జగ్గారావుకి చెబుతోంది.

కానీ కారు నడపడం కొత్తగా నేర్చుకుని పోలీసుల చేత, సాటి డ్రైవర్ల చేత, రోడ్డు మీద జనంచేత చివాట్లు తింటున్న జగ్గారావుకి ఇదంతా విసుగ్గా ఉంది. జానకమ్మ ఎంత పిసినారిదైతే తనకేం? ఇలా సరదాగా బయటకు వచ్చినప్పుడు గౌరి ఏదైనా ప్రేమ కబుర్లు చెప్పవచ్చుకదా అని అతని బాధ. అందుకే ఆమె దృష్టిని మరల్చబోయేడు. కానీ అది అతని ముప్పుకు వచ్చింది. కారు కొనడం అయిపోయింది కాబట్టి ఇంకేం కొనాలో గౌరి వల్లించడం మొదలుపెట్టింది. గండిపేటలో భోజనానికి మంచి హోటల్ ఏదైనా ఉందా అని అడుగుతోంది గౌరి. తిరిగి వచ్చేందుకు పెట్రోలు సరిపోతుందా లేక పెట్రోలు బంకు వాడి దగ్గర అరువు పెట్టాలా అని ఆలోచిస్తున్న జగ్గారావుకి ఓ పళ్ల అడ్వర్టయిజ్‌మెంటు కనబడి 'అమ్మయ్య' అనుకున్నాడు.

అవేమిటో ఎన్నారై పళ్లట! పేరెప్పుడూ వినలేదు. ప్రకటన రాసిన బోర్డు క్రిందనే ఓ స్టాలు పెట్టాడు ఓ ముసలాడు. కారు ఆపడానికి జగ్గారావు పడుతున్న అవస్థ చూసి ముసిముసిగా నవ్వుకుంటూనే పరిగెట్టుకు వచ్చాడు – "తీసుకోండి సార్, కొత్తరకం పళ్లు. వయస్సులో ఉన్నవాళ్లను ఉరకలు వేయించే పళ్లు. తీసుకో అమ్మా." అంటూ గౌరికి పళ్లబుట్ట అందించబోయాడు.

జగ్గారావు ఖంగారు పడ్డాడు. "బుట్టెడు పళ్లేం చేసుకుంటాం? డజను ఎలా ఇస్తావో చెప్పు. అసలీ పళ్లేంటి? ఎప్పుడూ చూడనేలేదు."

ముసలాడు చెప్పుకొచ్చాడు. ఓ ఎన్నారై ఆయన ఫారిన్లో ట్రయినింగు అయి వచ్చి హైదరాబాదు శివార్లలో ఫామ్‌హౌస్ పెట్టాట్ట. పాత రకాల చెట్లకు అంటు కట్టి, కొత్తరకాల పళ్లు, కాయగూరలు తయారు చేస్తున్నాడు. ఈ కొత్త పండుకి సపోటా రుచి ఉంటుందిట. మామిడిపండులా రసం వస్తుందిట. వెరైటీగా ఉంటుందని ఈ పండుకి 'ఎన్నారై' అని పేరుపెట్టారు. ప్రజల్లోకి ప్రచారం చేయాలని బుట్టల్లో పెట్టి చౌకగా అమ్ముతున్నారు. తిన్న తర్వాత మిగిలిపోయినవి తక్కినవాళ్లకు ఫ్రీగా ఇస్తారు కదా,

వాళ్లూ తిని పండు రుచి మరుగుతారని ఐడియా.

"అందుకే అయిదురూపాయలకు అరడజను అరటిపళ్లు రాని ఈ రోజుల్లో ఈ బుట్టెడు పళ్లు ఐదు రూపాయలకే ఇస్తున్నాం. ఈ రోజు మాత్రమే ఈ ఆఫర్! తీసుకోండి." అన్నాడు పళ్ల కొట్టువాడు.

"ఏమంటావు గౌరీ?" అడిగేడు జగ్గారావు. ఇవి తినేస్తే భోజనం ఎగ్గొట్టి టిఫెన్‌తో సరిపెట్టేయచ్చు కదాని అతని ఆలోచన.

"కొత్తరకం పళ్లంటున్నాడు. ఎలా ఉంటాయో ఏంటో? కొన్నాక నచ్చకపోతే డబ్బులు వేస్టు కదా! అసలు అవి తింటే డేంజరేమో, ఎవడికి తెలుసు?" అంది గౌరి అదోలా చూస్తూ.

షాపతను ఆడవాళ్లను బుట్టలో పెట్టడంలో ఘనుడిలా ఉన్నాడు. పళ్ల గురించి మాట్లాడలేదు. కారు గురించి మెచ్చుకున్నాడు. నెంబరు మంచి లక్కీనెంబరన్నాడు. పాతదైనా బెస్టుగా ఉందన్నాడు. అసలిలాటి క్వాలిటీ కార్లు ఈ రోజుల్లో రావటం లేదన్నాడు. కారు కంటే కారులో ఉన్న జోడీ మరీ పసందుగా ఉందన్నాడు. ఇలాటి పది కార్లలో తిరిగే కళ గౌరి ముఖంలో ఉట్టిపడుతోందన్నాడు. దెబ్బకి గౌరి పడిపోయింది.

"ఇదిగో ఆ బుట్ట ఇయ్యి. తెలీకపోయినా నువ్వు చెప్పావు కదాని తీసుకుంటున్నా." అంది మెహర్బానీగా.

"అది కాదమ్మా, నేను చూసి ఇస్తానుగా. ఫస్టుక్లాసయిన పళ్లిస్తాను. మిమ్మల్ని చూస్తే మా పాతరోజులు గుర్తొస్తున్నాయి నాకు." అంటూ కాస్త వెతికి నవనవలాడే పళ్లున్న బుట్టొకటి సెలక్టు చేసి కార్లో పెట్టాడు. జగ్గారావు దగ్గర డబ్బు తీసుకుంటూ. "ఏం ఫికరు చేయకు నాయనా, నువ్విచ్చిన డబ్బుకంటే ఎక్కువ విలువైనదే దొరుకుతుంది నీకు." అన్నాడు విశాలంగా నవ్వుతూ.

గండిపేట వెళ్లాక కూచోడానికి చోటు దొరకలేదు. కాస్త ఇవతలగా వచ్చి అక్కడ చెట్టు కింద కూచుని పళ్లు తిందామనుకున్నారు. కూచోడానికి నేల బాగాలేదు. జానకమ్మకు తెలియకుండా తెచ్చిన ఆవిడ చీర పాడయిపోతుందన్న భయం గౌరిది. "ఉండు, న్యూస్‌పేపరు పట్టుకొస్తా. ఆదివారం ఎడిషన్ కదా, బోల్డు కాగితాలుంటాయి. నేల మీద పరుచుకుని కూచోవచ్చు." అన్నాడు జగ్గారావు.

పేపరు రాగానే సిటీ ఎడిషన్ తీసింది గౌరి. "లక్ష రూపాయల నగ చోరీ" అన్న ఐటమ్ మీదే పడింది ఆమె దృష్టి. సిద్దియంబర్‌బజార్‌లో ఒక గృహిణి మెడలోంచి ఎవరో కొట్టేసారట. ఆమె స్థానిక రాజకీయ నాయకుని భార్య కావడంతో పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో వెతుకుతున్నారట. ఆ నగ గురించిన వర్ణన కూడా ఇచ్చేరు. దానిలో ఎన్ని రవ్వలు, పచ్చలు, పగడాలు ఉన్నాయో అన్నీ రాసారు.

"ఇన్ని పచ్చలు అవీ ఉన్నాయంటే లక్ష కంటె ఎక్కువ విలువే ఉంటుంది." అంది గౌరి.

"ఉండవచ్చు. అసలు ఖరీదు చెబితే దొరికే మాట ఎలావున్నా, ఇన్‌కమ్‌టాక్సు వాళ్లు వెంటపడతారని డబ్బున్న వాళ్ల బెరుకు. మనలాటి వాళ్లయితే పోయిన దానికి రెండింతలు ఎక్కువ చేసి చెబుతాం, దర్జాగా ఉంటుందని." అన్నాడు జగ్గారావు బుట్ట విప్పుతూ.

"ఏం మనకు మాత్రం ఏం తక్కువని? కారుందిగా. చూస్తూండు, మన పెళ్లి అయ్యేలోపున నీ చేత ఎన్ని కొనిపిస్తానో." అంది గౌరి పండు అందుకొని కొరుకుతూ.

జగ్గారావుకి భయం వేసింది. మాట మార్చాలని "పేరు వింతగా ఉన్నా, పండు రుచిగానే ఉంది కదా." అన్నాడు మరొకటి అందుకుంటూ. గౌరి తల ఊపుతూనే 'ఎర్రగా ఉన్నపళ్లు బాగా రుచిగా ఉన్నాయి. పండు, మంచిది వెతికి ఇస్తాను." అంటూ బుట్టలో చెయ్యి పెట్టి వెతకసాగింది. అంతలోనే చేతికి ఏదో తగిలినట్టనిపిస్తే ఆశ్చర్యపడుతూ బయటకు లాగింది.

"ఏయ్ఁ, ఏం చేస్తున్నావు. పళ్లన్నీ పాడయిపోతాయి జాగ్రత్త" అంటూ కిందపడిన పళ్లు మళ్లీ బుట్టలో పడేస్తున్న జగ్గారావు పళ్ల మధ్య ఇరుక్కున వస్తువుని చూసి అవాక్కయ్యాడు.

అది ఓ నెక్లెసు! రవ్వలతో, పచ్చలతో, పగడాలతో అచ్చు పేపర్లో రాసినదానిలాగానే ఉంది!

గౌరి మాట చెప్పనే అక్కర్లేదు. బుట్టనూ, పళ్లనూ, నెక్లెసునూ, జగ్గారావును మార్చి, మార్చి

చూడసాగింది. రెండు నిమిషాల తర్వాత స్పృహ వచ్చినట్టు అటూ, ఇటూ చూసి బుట్టలో పెట్టి పైన పళ్లు పెట్టి అప్పుడు పేపరు చేతి కందుతుంది. పేపర్లో వేసిన నగ వర్ణన క్షుణ్ణంగా మళ్లీ చదవింది. పళ్లను ఒత్తిగించి నగను పరీక్షగా చూసింది. చివరికి నిట్టూర్చి, "పేపర్లో వేసినది దీని గురించే. పోయిన నగ ఇదే! రాళ్ల లెక్కలు సరిగ్గా సరిపోయాయి." అని డిక్లేర్ చేసింది.

ఆమెకేసి తదేకంగా చూస్తున్న జగ్గారావు "మరి దీనిలో ఎలా చేరింది?" అని అడిగేడు అయోమయంగా.

"ఎలా చేరితేనేం? చివరికి నా మెడలోకి చేరింది." అంది గౌరి దాన్ని తీసి మెడలోకి వేసుకుంటూ.

"చాల్లే, అదృష్టవశాత్తూ మనం గండిపేట నుండి దూరంగా వచ్చి కూచున్నాం కాబట్టి సరిపోయింది. లేకపోతే మనమే ఆ దొంగలం అనుకొనేవారు."

"ఏడిశారులే. వాళ్లేమనుకుంటే మనకేంలేం గానీ నువ్వేమనుకుంటున్నావో చెప్పు. ఇది వేసుకుంటే నేను మహారాణీలా లేనూ?" అంది గౌరి మురిసిపోతూ.

జగ్గారావు ఆలోచనలు ఒకేదిశగా పయనిస్తున్నాయి. 'ఇది బుట్టలోకి వచ్చిందంటే, ఆ పళ్లకొట్టు ముసలాడే పడేసి ఉంటాడు. వాడికీ, దొంగలముఠాకి సంబంధం ఉండి ఉంటుంది. ఆ విషయం పోలీసులకు కూడా తెలిసిపోయి, వాళ్లు వెంటపడివుంటారు. ముసలాడు సరుకు తాత్కాలికంగా వదుల్చుకోవడానికి ఎత్తేసి దాన్ని తమకు అంటగట్టాడు. బోల్డంత గాస్ కొట్టాడు, బుట్ట వెతికి, వెతికి మరీ ఇచ్చాడు. చివర్లో అన్నాడు కూడా - మీరిచ్చిన డబ్బు కంటే మీకు ఎక్కువే ముట్టింది' అని. దానికి ఇదే అర్థం.'

గౌరి అంతా విని, "ప్రస్తుతానికి మనకి ఇచ్చాడే అనుకో. మళ్లీ మనని ఎలా వెతికి పట్టుకోగలడు? సరుకు మన దగ్గర్నుంచి ఎలా రాబట్టగలడు?"

"పిచ్చిదానా, అందుకే లక్కీ నెంబరు అని చెబుతూ కారు నెంబరు గుర్తుపెట్టుకున్నాడు. రేపు ఆర్టీఏ ఆఫీసులో అడిగితే కారు ఎవరి పేర రిజిస్టరయ్యిందో తెలిసిపోతుంది. మన పాతకారే ఓ కొండగుర్తు. ఇంకో గంటలో మా రూమ్‌కి చేరతాడు నెక్లెస్ ఎక్కడా అంటూ."

"వాణ్ని గంగలో దిగమను. చేరవలసిన అందగత్తెకే చేరిందని చెప్పు."

"చాల్లే, వాడు నన్ను చంపితే? అంతకంటే నగను పోలీసులకు అప్పగిస్తే మంచిది."

"నీకేం మతిపోయిందా? లక్ష రూపాయల పై చిలుకు నగ, మన అదృష్టం కొద్దీ వెతుక్కుంటూ వచ్చింది. మనమేమైనా కన్నం వేసామా? జేబులు కొట్టామా? ఇది వేసుకుంటే నేను ఎలా ఉన్నానో ఒక్కసారి సరిగ్గా చూసి అప్పుడు మాట్లాడు.."

"అది ఉన్నా, లేకున్నా నువ్వు రంభలా ఉన్నావు. అందులో అనుమానం లేదు. పోలీసులకు ఇచ్చేస్తే గొడవ వదిలిపోతుంది కదాని..." నాన్చేడు జగ్గారావు.

పది నిమిషాలకు గానీ గౌరి నోరు విప్పలేదు. "జగ్గూ, నీ కో విషయం చెప్పాలి. నాకు పోలీసులంటే భయం. ఓ సారి మా జానకమ్మ గారింట్లో వడ్డాణం పోతే, నా మీద అనుమానపడి పోలీసు కంప్లెయింటు ఇచ్చారు. వాళ్లు ఓ రోజంతా లాకప్పులో పెట్టి నానా యాతనా పెట్టారు. లక్ష ప్రశ్నలేసారు. చివరికి ఋజువులేమీ దొరక్క వదిలిపెట్టేరు. కానీ ఈసారి కనక ఇలాటి నగతో వెళితే పాత కేసు కూడా తవ్వి అదీ నేనే చేసేననుకుని తన్ని వదిలిపెడతారు. అందుచేత పోలీసుల మాట విడిచిపెట్టు."

"మరేం చేయమంటావు చెప్పు. ఆ నెక్లెసు పట్టుకుని నువ్వు గాని, నేను గాని మన ఇళ్లకు చేరడం ప్రమాదం."

"ఆ విషయం నాకూ తెలుసు. అందుకే నాకో ఐడియా వచ్చింది. దీన్ని అమ్మేద్దాం. కనీసం లక్షయినా వస్తుంది. ఝామ్మని పెళ్లి చేసేసుకుని ఈ కారు అమ్మేసి కొత్తకారు కొందాం. ఆ కార్లో ఊటీ వెళదాం."

జగ్గారావు ఆమెకేసి వింతగా చూసాడు. తనకు తెలిసిన గౌరి కాదీమె. నెక్లెసు మహిమ! ఎంత త్వరగా మనిషిని మార్చేసింది! కానీ అతను మాత్రం వల్లకాదన్నాడు. జీవితంలో ఒకే ఒక్కసారి తప్పు

చేస్తే ఫరవాలేదంది గౌరి. అదీ తాము ఎవరి జేబులోంచి కొట్టేయలేదు. వస్తువు పోగొట్టుకున్నది ఒళ్లు బలిసినవాడే లేనివాడు కాదు అని గౌరి వాదన. ఏది ఏమైనా నీతి తప్పడం పనికిరాదని తన పెంపకం చెబుతోందన్నాడు జగ్గారావు. అన్నాడే కానీ అరగంట తర్వాత గౌరి లాలింపులకు, బెదిరింపులకు లొంగిపోయాడు. అయినా చివరి అస్త్రంగా, "అమ్మడం అంత సులభం అనుకుంటున్నావనుకున్నావేమో! జ్యూయలరీ షాపు వాడి దగ్గరికి వెళితే పోలీసులకు పట్టిస్తాడు." అన్నాడు.

"అందుకనే మనం బ్రోకరు దగ్గరకు వెళ్లాలి. వాడు కమీషను తీసుకుని అమ్మి పెడతాడు."

"నాకలాటి బ్రోకరు ఎవరూ తెలీదు, గౌరీ!"


"నాకు తెలుసు."

"నీకా? నీకెలా తెలుసు? నీ కిలాటి వాటిల్లో అనుభవం.."

"ఖంగారు పడకు, తొందరపడకు. నేను దొంగను కాను, దొంగసరుకు అమ్మేదాన్ని కాను. మా జానకమ్మ ధర్మమాని ఓ రోజు పోలీసు లాకప్‌లో కూచోవాల్సి వచ్చిందిగా. అప్పుడు వెంకోబా అని ఒకడు నా దగ్గరికి వచ్చి సరుకేదైనా ఉంటే అమ్మి పెడతానని తన వివరాలు చెప్పాడు. నేను అలాటి దాన్ని కాదని చెప్తే నుదురుకొట్టుకుని వెళ్లిపోయాడు. ఆ పరిచయం ఇప్పుడు పనికొస్తుంది."

గండిపేటకు వెళ్లేటప్పుడు ప్రేయసీ ప్రియులకుండే హుషారు ఉంటే, తిరుగు ప్రయాణంలో నడమంత్రపుసిరి పట్టినవాళ్లకుండే హుషారుంది వాళ్లకి. రాబోయే లక్షతో ఏమేం చెయ్యవచ్చో గౌరి రకరకాల ప్లానులు చెప్పింది. చివరికి కారు రెడ్‌హిల్స్ ప్రాంతంలో ఆగింది. జగ్గారావుని కార్లోనే కూచోమని చెప్పి గౌరి వెంకోబాను వెతికిపట్టుకుంది. ఇంకో పావుగంటలో వాళ్లు వెంకోబా గదికి చేరడం, అతనికి అన్నీ చెప్పడం జరిగిపోయాయి. నగ చూడందే ఎంత వచ్చేదీ చెప్పలేనన్నాడు వెంకోబా. కారులో దాచిన నగను అంత త్వరగా బయటపెట్టడం ఇష్టపడలేదు జగ్గారావు.

"పేపర్లో వేసిన సిద్దియంబరుబజారు నగే అది! సందేహం లేదు. రేటు తేల్చు." అన్నాడు జగ్గారావు అసహనంగా.



"మర్యాదగా ఆ నగ నా చేతికియ్యి." అన్నాడు వెంకోబా కర్కశంగా. అతని చేతిలో పిస్టలు మెరుస్తోంది. గౌరి, జగ్గారావు చెంతకు చేరింది ఒక్క గంతులో. ఇద్దరూ ఒకడుగు వెనక్కి వేసారు. జగ్గారావు ధైర్యం తెచ్చుకుని, "పోలీసులను పిలిస్తే నీకూ ప్రమాదమని తెలుసుకో." అన్నాడు మెల్లగా.

వెంకోబా నవ్వేడు. "నేను పోలీసువాణ్నే. స్టేషన్లో ఎంత హింసించినా నేరస్తులు దొంగిలించిన సొత్తు ఎక్కడుందో చెప్పరు. అందుకని మాలో కొంతమంది బ్రోకర్లుగా వాళ్లని ఎప్రోచ్ అవుతాం. నిమిషాల్లో వస్తువు బయటపడుతుంది. జానకమ్మ గారింట్లో నగ పోయినప్పుడు కూడా ఈ గౌరిని అనుమానించి నేను ఎప్రోచ్ అయ్యాను. కానీ ఆమె వైఖరి చూసి అమాయకురాలని వదిలేసాను. కానీ ఇప్పుడు తెలిసింది - ఆమె దొంగ అనీ, ఆమెకో తోడు కూడా ఉన్నాడనీ. సిద్దియంబరుబజారు నగ గురించి పోలీసులు మా అందర్నీ ఎలర్ట్ చేసారు. ఎవరొస్తారా అని ఎదురుచూస్తున్నాను. మీరే వచ్చారు. వెర్రివేషాలు వేయకుండా లొంగిపోండి. జానకమ్మ నగ కూడా ఎక్కడ దాచారో చెప్పండి." అన్నాడు తుపాకీ ఆడిస్తూ.

తామెంత ఊబిలో చిక్కుకున్నదీ జగ్గారావుకి అర్థం అయ్యింది. పోలీసుల పాలబడితే జీవితమంతా నరకమే! పక్కన కనబడిన కిచెన్‌నైఫ్ తటాలున అందుకుని వెంకోబాపైకి ఉరికి, అతని పొట్టలో పొడిచేడు. అతను "అబ్బా" అంటూ నేల కూలగానే బాణంలా పరిగెత్తి, పరిగెత్తి రైలు పట్టాల వద్దకు చేరి అప్పుడే వేగం పుంజుకుంటున్న రైలు చివరిబోగీని అందుకున్నాడు. ఆ రైలు మహారాష్ట్ర వెళుతుందని ఎవరో చెప్పాక, జీవితమంతా అక్కడే మారుపేరుతో గడిపితే మంచిదని నిశ్చయించుకున్నాకనే అతనికి గౌరి గుర్తుకువచ్చింది. ఇదంతా గౌరి కారణంగానే జరిగింది కాబట్టి, ఆమె గురించి మర్చిపోవడమే మంచిదని దృఢంగా అనుకున్నాక ఆమెను తన తలపులలోంచి పూర్తిగా నెట్టివేసాడు.

కానీ గౌరి మాత్రం అతన్ని ఎప్పటికీ మర్చిపోలేకపోయింది. దానికి కారణం, మర్నాడు పేపర్లో పడిన న్యూస్‌ఐటమ్

## వినూత్న మార్కెటింగు విధానం

'కొత్తగా మార్కెట్‌లో ప్రవేశించిన ఎన్నారై ఫ్రూట్‌వారు తమ పళ్లను అమ్మే విధానంలో ఆదివారం నాడు కొత్తపోకడలను అవలంబించారు. ఆ రోజు బుట్టెడు పళ్లను ఐదు రూపాయలకే అమ్మడంతోబాటు, ప్రతీ పది బుట్టలోనూ ఒకదానిలో ఒక చిలకలూరిపేట ఇమిటేషన్ నగను కూడా 'సర్‌ప్రైజ్ గిఫ్ట్'గా అమర్చారు. అనుకోని ఈ బహుమతి అందుకున్నవారు ఈ పళ్లను మరింత ఎక్కువగా ఆదరిస్తారని తాము నమ్ముతున్నట్టు ఆ కంపెనీ మార్కెటింగు మానేజరు శ్రీ విజయేంద్ర ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు....'